క్లుప్తంగా

హనుమాన్ భక్తుల పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని పిక్లాతండా గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు శనివారం పాదయాత్రగా కొండగట్టుకు పయనమయ్యారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్ర చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఉట్నూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గృహంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శేషారావు గడిచిన ఐదేళ్లుగా బీఆర్‌ఎస్‌లో ఉన్నారు.

ప్రతీ కూలీ రూ.300 సంపాదించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: ఉపాధి హామీ పథకంలో పని చేసే ప్రతీ కూలీ రోజుకు రూ. 300 సంపాదించాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని గోయగాం గ్రామ పంచాయతీ భీమన్‌గొంది గ్రామంలో ఉపాధి కూలీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు ఉపాధిపనికి వెళ్లాలన్నారు. ఎలాంటి పనులు కావాలన్నా ఉపాధి అధికారులు సాయపడతారని పేర్కొన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఎఫ్ఏ, టీఏ తదితరులు ఉన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ అబ్రహం, శివప్రసాద్ తెలిపారు. సమావేశంలో సంఘం అభివృద్ధి, సంఘం ఆర్థిక లావాదేవీలు, తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక లైన్లు

కాగజ్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత మానసిక వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ద్వారకానగర్‌లో గల శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత మానసిక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్యనిపుణులు రవి వర్మ, సాయిలక్ష్మి తెలిపారు. మైండ్ మ్యాటర్స్ మంచిర్యాల న్యూరో సైకియాట్రీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరంలో మత్తుపదార్థాలు, ఆల్కహాల్, డ్రగ్స్, గంజాయిలకు బానిసలైన వారికి ఉచిత కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆందోళన, గుండెల్లో దడ, గుబులు, వివిధ రకాలైన తలనొప్పులు, అతిగా అల్లరి చేయడం, తదితర రుగ్మతలు, వ్యాధులకు ఉచిత చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రస్మా కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా కార్యవర్గం ఎన్నికలు జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యవర్గంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా దేవ భూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా రాజేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యారు. సంఘం నాయకులు కిషన్ రావు, ఆదినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డా..!

- కౌటాల మినీస్టేడియంలో అసాంఘిక కార్యకలాపాలు
- మద్యం బాటిళ్లు తాగి పడేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు


మైదానంలో తాగిపడేసిన మందుబాటిళ్లు



ఊడిపోయిన కౌటాల మినీస్టేడియం గేటు

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియం మందుబాబులకు అడ్డాగా మారింది. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నిధులు కేటాయించి స్టేడియం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి మైదానంలో ఇండోర్ భవనం నిర్మించారు. కానీ నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం స్టేడియానికి ఏర్పాటు చేసిన గేటు విరిగిపోవడంతో స్టేడియంలో పశువులు సైతం సంచరిస్తున్నాయి.

నిరుపయోగంగా..

కౌటాల మినీ స్టేడియంలో ఇండోర్ స్టేడియం నిర్మాణంతో పాటు సౌకర్యాల కల్పన కోసం 2016లో రూ.1.80 కోట్లతో గుత్తేదారు పనులు చేపట్టారు. మైదానంలో ఇండోర్ స్టేడియం భవనం నిర్మించారు. కాని అధికారులు ఇండోర్ స్టేడియంలో పరికరాలు సమకూర్చకపోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. స్టేడియం నిర్వహణకు నిధులు కేటాయించకపోవడం, కాపలాదారు లేకపోవడంతో ఇండోర్ స్టేడియంలోని విద్యుత్ సామగ్రి, లైట్లు చోరీకి గురయ్యాయి. మైదానం చుట్టూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేసేందుకు వీలుగా నాలుగేళ్ల క్రితం మొరం వేశారు. భారీ వర్షాల కారణంగా మొరం కొట్టుకొని పోవడంతో వాకింగ్‌ట్రాక్ నిరుపయోగంగా మారింది. మైదానంలో క్రీడాకారులకు నిర్మించిన విశ్రాంతి భవనం సైతం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది.

మైదానంలో మద్యం బాటిళ్లు..

కౌటాల మినీ స్టేడియం చుట్టూ ప్రహరీ ఉన్నా, గేట్ లేకపోవడంతో చీకటి పడితే చాలు ఇక్కడ మందుబాబులు ప్రత్యక్షమవుతున్నారు. మద్యం, సిగరెట్లు, గంజాయి తాగడానికి అడ్డాగా స్థానిక మినీ స్టేడియం వేదికైంది. మందుబాబులు మద్యం తాగి బాటిళ్లు పగులగొట్టి అక్కడే పడేస్తున్నారు. మరికొందరు వాకింగ్ ట్రాక్‌పైనే మద్యం సీసాలు పడేస్తున్నారు. కాగా కౌటాలలో స్థలం దొరకడం లేదనే సాకుతో మినీ స్టేడియానికి తెలంగాణ క్రీడా ప్రాంగణం అని అధికారులు బోర్డు తగిలించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్రీడా మైదానం ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.4 లక్షల నుంచి రూ. 5లక్షలు వెచ్చించారు. కానీ అధికారులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేసిన దాఖలాలు లేవని ఆరోపణలున్నాయి.

పోలీసుల నిఘా కరువు

మినీ స్టేడియంలో చాలామంది ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం, యువత ఉద్యోగాల కోసం సాధన చేయడం, తల్లిదండ్రులు స్టేడియంలోకి చిన్న పిల్లలను తీసుకొచ్చి ఆడిస్తుండడం వంటివి చేస్తుంటారు. అప్పుడప్పుడు రాజకీయ పార్టీల సభలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. అలాంటి క్రీడా ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పోలీసుల నిఘా కరువైందని విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి గేటు ఏర్పాటు చేయడంతో పాటు స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గేట్ ఏర్పాటు చేయాలి

మినీస్టేడియానికి గేట్ లేకపోవడంతో స్టేడియంలో పశువులు సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో మందుబాబులు, ఆకతాయిలు మద్యం సేవించి స్టేడియంలోనే మద్యం బాటిళ్లు పగలగొడుతున్నారు. ప్రభుత్వం మినీ స్టేడియంలో క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలి. అధికారులు స్పందించి గేట్ నిర్మించాలి.

- రాజేశ్వర్, కౌటాల

ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలి


మురళీగూడలో మాట్లాడుతున్న కోనప్ప

పెంచికల్‌పేట్: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. మండలంలోని గుండెపల్లి, మురళీగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు వద్ద కరెంటు సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరించాలని విద్యుత్ ఏడీకి తెలియజేశారు. అనంతరం మురళీగూడ గ్రామానికి చెందిన ఎర్రయ్య, జిల్లెడ గ్రామానికి చెందిన బాపు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను కోనేరు కోనప్ప పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు జగ్గాగౌడ్, డోకె వెంకన్న, చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, శ్రీనివాస్, సంజీవ్, సాజీద్, ఈశ్వరి, మధునయ్య, వెంకన్న, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బెజ్జూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఆయన పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈనెల 27న బెజ్జూర్ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీవర్ధన్, శంకర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు హకీమ్, బషరత్ ఖాన్, జగ్గగౌడ్, వెంకన్న, నాహెర్‌అలీ, రాజారాం, నందరాం, జావీద్, సతీష్, మహేశ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ గెలుపే లక్ష్యంగా ప్రతీ బీజేపీ కార్యకర్త బూతుస్థాయిలో పనిచేయాలని బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్ లోయ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన పథకాలను, సంక్షేమ అభివృద్ధి పనులను తెలియజేయాలన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు గణపురం నగేష్, కుకిడే రాజేశ్వర్, రౌతు భుజంగరావు, కడంబ శ్రీనివాస్, పాగిడే కాంతారావు, అన్నం గణపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేశారు. అనంతరం బూతు కమిటీలను ఏర్పాటు చేశారు. నాయకులు బిట్టి శ్రీనివాస్, చిన్నయ్య, సుధాకర్, సురేశ్, గణేశ్, మధుకర్, శ్రీనివాస్, చిన్నన్న, నారాయణ, భద్రయ్య, సుగుణాకర్, గంగాధర్, పెంటయ్య, సోమయ్య, తిరుపతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి

దహెగాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని జెడ్పీ సీఈవో, ఎన్నికల నోడల్ అధికారి అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, పార్వతిపేట, పెసరికుంట గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో రాజేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్ తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న క్షేత్రయ్య

తిర్యాణి: గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఏటీడీవో క్షేత్రయ్య అన్నారు. శనివారం మండలంలోని మంగీ గ్రామ పంచాయతీ పరిధిలో గల పిట్టగూడ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామ పటేల్ ఉర్వేత లచ్చు గ్రామంలోని నీటి సమస్యను వివరించారు. గ్రామంలో ఒకటే బోరింగు ఉండటంతో 15 కుటుంబాలకు నీరు సరిపోవడం లేదన్నారు. ఏదైన కార్యక్రమం నిర్వహిస్తే పక్క ఊర్లలో నుంచి డ్రమ్ముల ద్వారా నీరు తీసుకురావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటీడీవో స్పందించి సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌సీఆర్పీ యశ్వంత్‌రావు ఉన్నారు.

‘ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికావు’

కౌటాల: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని కన్నెపల్లి ఎంపీటీసీ దుర్గం మోతీరాం అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు లక్కీడ్రాలో గెలిచారన్న కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కోనప్పకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా పది రోజులు కూడా ప్రతిపక్షంలో ఉండలేక పోయారని ఎద్దేవ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు బండురావు, సత్తయ్య, మిథున్, శ్రీకాంత్, నాగయ్య, బాపురావు, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం’


మాట్లాడుతున్న మాజీ జెడ్పీచైర్మన్ సిడాం గణపతి

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీచైర్మన్ సిడాం గణపతి అన్నారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ ఆడపడుచు సీతక్కపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్షమాపణ చెప్పకపోతే తొమ్మిది ఆదివాసీ సంఘాలతో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బెజ్జూర్ మండలంలోని రెబ్బెన గ్రామంలో పాల్వాయి రాములు భూములను పాల్వాయి హరీశ్‌బాబు కుటుంబం తమ పేరిట పట్టా చేసుకొని మోసం చేసిందని, బాధితుడికి న్యాయం చేయాలని లేకపోతే రెబ్బెన గ్రామంలో ఆందోళన చేస్తామన్నారు.

25న సర్వసభ్య సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వంటగ్యాస్ వినియోగం, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండెన్ గ్యాస్ కంపెనీ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్యాస్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి దత్తాత్రేయ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కంచె తొలగింపు


కంచె తొలగిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట అక్రమంగా వేసిన కంచె, పోల్స్‌ను శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో గంగాసింగ్ ఆధ్వర్యంలో తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చేస్తే కేసులను నమోదు చేస్తామన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. వేసవి ఎండ తాపం నుంచి ఉపశమనం కోసం అంబలి పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పుల్లూరి శంకర్, డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, నాంపెల్లి శంకర్, రావుల వినాయక్, సభ్యులు ఖాండ్రే విశాల్ పాల్గొన్నారు.

ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవాలి


వీర్దండిలో కవాతు చేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి


మాట్లాడుతున్న నర్సయ్య

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘం గోలేటి బ్రాంచి అధ్యక్షుడు రాయిల్ల నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రతినెల 7వ తేదీ నుంచి 10వ తేదీ లోపూ వేతనాలు చెల్లించాలని ఒప్పందం జరిగినప్పటికి యాజమాన్యం అమలు చేయడం లేదని ఆరోపించారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనాలు కూడా దక్కడం లేదన్నారు. నాయకులు రవీందర్, వెంకటేశం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ


శికారే ఆర్తి


హండేబగ్ రూప


కాంబ్లె ప్రీతమ్


బంగారే జీవన్

కెరమెరి: గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని లేండిగూడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు శికారే ఆర్తి, హండేబగ్ రూప, కాంబ్లె ప్రీతమ్, బంగారే జీవన్‌లు సీట్లు సాధించారు.

గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ఎంపిక

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ గురుకుల సొసైటీ విడుదల చేసిన ఫలితాల్లో మండలంలోని చింతగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల విద్యార్థులు వేముర్ల సుహాని, పెబ్బర ధరణి, అజిత్ రహానే, నీలం ఆర్యన్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదే పాఠశాలలో కోచింగ్ తీసుకున్న బలగల గ్రామానికి చెందిన లక్ష్మి, కోయవాగు గ్రామానికి చెందిన రాంటెంకి గ్రీష్మ విద్యార్థులు కూడా గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలని హెచ్‌ఎం ఎంఎల్ రాజు అన్నారు. గురుకుల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి సీట్లు పొందిన తలోడి పాఠశాలకు చెందిన విద్యార్థులు కరణ్, సందీప్‌ను ఆయన శనివారం తలోడి పాఠశాలలో అభినందించారు. సమావేశంలో ఉపాధ్యాయులు సురేశ్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళులు

ఆసిఫాబాద్: ఆదివాసీ అమర వీరులకు ఇంద్రవెల్లిలోని అమరుల స్థూపం వద్ద శనివారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరులు చేసిన త్యాగాలను కొనియాడారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పెద్దబండ వాగు సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో రెండోరోజు శనివారం విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గురుస్వామి బ్రహ్మశ్రీ మునునూరి సూర్య భాస్కర శర్మ, బ్రహ్మశ్రీ మునునూరి సాయికిరణ్ శర్మల ఆధ్వర్యంలో సూక్ష్మ స్థాపిత దేవతా హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈనెల 21న విగ్రహ ప్రతిష్ఠాపన, మహా పడిపూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు పరిచయ కార్యక్రమం

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023- 24 సంవత్సరానికి డిగ్రీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కోఆర్డినేటర్ తూదూరు దత్తాత్రేయ తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓపెన్ యూనివర్సిటీ తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం


పనులు చేపడుతున్న పాలకవర్గ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 23న పట్టణంలో నిర్వహించి హనుమాన్ శోభాయాత్రకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా తెలిపారు. ఈమేరకు హనుమాన్ ర్యాలీ ప్రారంభమయ్యే హనుమాన్ మందిర్ వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, వైస్‌చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు కీర్తి శ్రీనివాస్, బంక శివ, జయచందర్, రాము, మహబూబ్, వసీం తదితరులు పాల్గొన్నారు.